


# కరపత్రం

SINCE 2014

బుధవారం అక్టోబర్ 30 2024 | సంపుటి :0 | సంచిక : 22 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు



● మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముందడుగు వేయడమే తప్పు.. వెనక్కి తగ్గే ప్రసక్తేలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

●ఏదైనా నిర్ణయం తీసుకునే ముందే వెయ్యి సార్లు ఆలోచిస్తామని..

తీసుకున్నాక వెనక్కి వెళ్లేది లేదన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. నవంబరు 1న మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేయనున్నట్టు ప్రకటించారు. తొలుత బాపూఘాట్ నుంచి పనులు ప్రారంభించనున్నట్లు చెప్పారు. నవంబర్ లోపు ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలుస్తామని చెప్పారు. ప్రాజెక్టు పనులపై ప్రతిపక్షాలతో చర్చలకు సిద్ధమన్నారు. త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్టు సీఎం తెలిపారు.

మిగతాది 2లో


## మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం

సిద్దిపేట జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. హుస్నాబాద్ పట్టణంలో ఇంటి ముందు ఆడుకుంటున్న మైనర్ బాలికపై ముగ్గురు యువకులు సామూహిక అత్యాచారం చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన గురించి బాలిక సోమవారం రాత్రి తన తల్లికి వివరించింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. అత్యాచారం చేసిన ముగ్గురు యువకులు.. బాలిక ఉంటున్న కాలనీకి చెందినవారుగా గుర్తించినట్లు చెప్పారు. బాలికను వైద్య పరీక్షలకు పంపినట్లు సీఐ తెలిపారు.



## డ్రగ్స్ విక్రయిస్తూ.. పట్టుబడ్డ బిటెక్

### పక్కా సమాచారంతో పోలీసుల పట్టివేత



మిగతాది 2లో

భాగ్యనగరాన్ని డ్రగ్స్ మహమ్మారి వీడటం లేదు. నిత్యం ఎక్కడో ఒక చోట డ్రగ్స్ పట్టుబడుతూనే ఉంది. ఎక్కువ మొత్తంలో డబ్బులు సంపాదించాలనే దురాలోచనతో యువత చెడు మార్గాలను ఎంచుకుంటోంది. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలైన పరిస్థితి ఏర్పడుతుంది. ఉన్నత చదువులు చదువుకుని, మంచి ఉద్యోగం సంపాదించి స్థిరపడాల్సిన కొంతమంది యువత చెడుమార్గాలను ఎంచుకుని జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇటీవలే హైదరాబాద్‌లో భారీ డ్రగ్స్ పట్టుబడి మూడు రోజులు కూడా గడువకముందే మరోసారి డ్రగ్స్ పట్టుబడింది.




మిగతాది 2లో

## రుణమాఫీపై ప్రతిపక్షాలవి కారుకూతలు:

రైతులు తీసుకొచ్చిన పత్తిలో కోత విధిస్తే సహించేది లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేబ్రిడ్జి కాటాలో తేడా వస్తే మిల్లు సీజ్ చేయిస్తామని హెచ్చరించారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడారు."ఈ సంవత్సరం అధిక వర్షాలతో రైతులు పత్తి పంట నష్టపోయారు.

## కాంగ్రెస్ తీసుకుని వచ్చిన మార్పు ఇదే




●గణనీయంగగా తగ్గిన కంపెనీల రిజిస్ట్రేషన్లు

●ఎక్స్ వేదికగా హరీష్ రావు విసుర్లు

కాంగ్రెస్ పాలనలో కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గిపోయాయంటూ మాజీ మంత్రి హరీష్ రావు ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు క్రమంగా తగ్గుతున్నాయని, తెలంగాణ ఆర్థిక అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందంటూ వ్యాఖ్యలు చేశారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహార మంత్రిత్వ శాఖ నివేదికను కోట్ చేస్తూ మాజీ మంత్రి హరీష్ రావు ఎక్స్‌లో పోస్టు చేశారు. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజా నివేదిక ప్రకారం 2023-24 తో పోలిస్తే 2024-25 జూలై నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో కొత్త కంపెనీల రిజిస్ట్రేషన్లు తెలంగాణలో గణనీయంగా తగ్గినట్టు వెల్లడించిందని తెలిపారు.

మిగతాది 2లో

## విద్యుత్ భారం పడకుండా కాపాడారు



ఈఆర్సీకి కెటిఆర్ కృతజ్ఞతలు

2లో

### రేవంత్ ప్రభుత్వంతో అప్రమత్తంగా ఉండాలి

●తప్పుడు కేసులతో బెదిరింపులు తప్పడం లేదు

●పార్టీ శ్రేణులకు కెటిఆర్ హెచ్చరిక



2లో

## వివేకా హత్య కేసు.. ఉమాశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ



వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఏ3గా ఉన్న ఉమాశంకర్‌రెడ్డి బెయిల్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం వాదనలు కొనసాగాయి. ఈ కేసులో బెయిల్ మంజూరు చేయాలని ఉమాశంకర్ రెడ్డి ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఉమాశంకర్ రెడ్డిని ప్రత్యక్ష సాక్షి గుర్తించలేదని.. పొడవుగా, నల్లగా ఉన్నాడని చెప్పిన మాటల ఆధారంగా ఈ కేసులో నిందితుడిగా చేర్చారని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. అయితే, సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగానే నిందితుడిని గుర్తించామని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను వాయిదా వేశారు.

## తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ కృషి: కేంద్రమంత్రి బండి సంజయ్



తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ప్రధాని మోదీ ఎంతో కృషి చేస్తున్నారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. విశాఖపట్నంలోని వీఎంఆర్డీఏలో నిర్వహించిన రోజ్‌గార్ మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. "ప్రధాని మోదీ రెండేళ్ల క్రితం రోజ్‌గార్ మేళా ప్రారంభించారు. పది లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన నిర్ణయించారు. రెండేళ్లలో 8 లక్షల మందికి ఇప్పటికే ఉద్యోగాలు ఇచ్చారు. విశాఖపట్నంలో ఇంకా ఎంతో అభివృద్ధి జరగాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించింది మోదీ ప్రభుత్వమే" అని బండి సంజయ్ అన్నారు.

# మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు

మొదటిపేజీ తరువాయి

**మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడని ప్రజలకు తెలిసింది..**

"భారాస నేతలు మూసీ పునరుజ్జీవంపై అభ్యంతరాలను తెలియజేయాలి. నన్ను కలవడానికి ఇబ్బంది అయితే మంత్రులు, అధికారులను కలిసి చెప్పొచ్చు. బాపూఘాట్ నుంచి వెనక్కి 21 కి.మీ అభివృద్ధి చేస్తాం. మల్లన్న సాగర్ నుంచి మూసీకి నీరు తరలిస్తాం. మల్లన్నసాగర్ నుంచి గోదావరి నీటి తరలింపునకు నవంబరులో టెండర్లు పిలుస్తాం. మూసీ అభివృద్ధి అధ్యయనానికి నగర ప్రజాప్రతినిధులను పంపుతాం. నగర ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లను సియోల్‌కు పంపుతాం. మూసీ పునరుజ్జీవంపై కావాలనే చర్చకు తెరలేపాను. ఈ చర్చ కారణంగా ప్రజలకు అవగాహన కలిగింది. మూసీని బాగు చేసేవాడొకడు వచ్చాడని ప్రజలకు తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకం అభివృద్ధి చెందుతుంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లపై విచారణ జరుగుతోంది. విచారణ సమయంలో కక్ష సాధింపు ఉండదు. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగానే చర్యలు ఉంటాయి. రాజకీయంగా నష్టం జరిగినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రజలకు చేయాలనుకున్న మేలు చేసి తీరుతాం. ముఖ్యమంత్రి అవ్వాలనుకున్న నా కల నెరవేరింది. ముఖ్యమంత్రి పదవి కంటే పెద్ద కలలు నాకు వేరే ఏమీ లేవు.

**నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని.. గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది..**

కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా.. నేను రుణమాఫీ చేశా. ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నాం. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం.. ఫీజు రీయింబర్స్‌మెంట్ చేశాం. మూసీ కోసం భూములిచ్చేవారికి వందశాతం సంతృప్తి చెందేలా ప్యాకేజీ ఇస్తాం. ప్రజలను కష్టపెట్టి భూములు తీసుకోబోం. ప్రాజెక్టును ఎన్జీవోలు వ్యతిరేకిస్తే అర్థం ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారాస ఎందుకు వ్యతిరేకిస్తుందో అర్థం కావట్లేదు. కేటీఆర్ ప్రపంచస్థాయి మేధావిని అనుకుంటారు. మూసీని బాగు చేసే అంశంలో కేటీఆర్ తన ఆలోచనలు చెప్పొచ్చు. అంతర్జాతీయ అవగాహన ఉన్న ఆయనకు మూసీని ఎలా బాగు చేయాలో తెలియదా? ఈ ప్రాజెక్టుపై కేటీఆర్ నుంచి సలహాలు ఆహ్వానిస్తున్నా. కేటీఆర్, హరీశ్‌రావు, ఈటల తమ ప్రతిపాదనలు తెలపాలి. నేను ఫుట్‌బాల్ ప్లేయర్‌ని.. గేమ్ ప్లాన్‌పై నాకు స్పష్టత ఉంది. 55 కి.మీ మూసీ పునరుజ్జీవం పూర్తయితే అద్భుతనగరం ఆవిష్కృతమవుతుంది" అని

## డ్రగ్స్ విక్రయిస్తూ.. పట్టుబడ్డ బిటెక్ విద్యార్థి

మొదటిపేజీ తరువాయి

పక్కా సమాచారంతో థియేటర్ వద్ద డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. అయితే డ్రగ్స్‌ను విక్రయిస్తూ బీటెక్ విద్యార్థి పట్టుడ్డారు.. వనస్థలిపురంలో సుష్మ థియేటర్ వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం వెళ్లింది. పక్కా సమాచారంతో థియేటర్‌కు వద్దకు వెళ్లిన హయత్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు.. తనిఖీ చేయగా డ్రగ్స్ విక్రయిస్తూ బీటెక్ విద్యార్థి జాన్ పట్టుబడ్డాడు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న జాన్ నుంచి 7 గ్రాముల ఎండీఎమ్ఏ డ్రగ్స్‌ను గుర్తించిన పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్‌తో పాటు విద్యార్థి సెల్‌ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రాము డ్రగ్‌ను రూ. 2500కు తీసుకొచ్చి రూ.5000 చొప్పున అమ్మకాలు చేస్తున్నాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. నిందితుడు నెల్లూరు జిల్లా వాసిగా గుర్తించారు. విద్యార్థి ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నాడు. కాగా.. ఇటీవల హైదరాబాద్‌లో పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడిన విషయం తెలిసిందే. లోకల్ పోలీసులతో కలిసి హెచ్ న్యూ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇంటర్నేషనల్ డ్రగ్ ఫెడ్లర్‌తో పాటు అంతర్రాష్ట్ర డ్రగ్ ఫెడ్లర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హుమయూన్‌నగర్, హెచ్ న్యూ పోలీసుల జాయింట్ ఆపరేషన్‌లో భారీగా డ్రగ్స్ పట్టుబడింది. విదేశీ డ్రగ్ పెడ్లర్ నుంచి 50 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కంచన్‌బాగ్ పోలీసులకు మరో అంతర్రాష్ట్ర డ్రగ్ ఫెడ్లర్ చిక్కాడు. అతని వద్ద నుంచి 80 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 25 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను హైదరాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## హాజీపూర్ మండలంలో పెద్దపులి సంచారం.. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక



హాజీపూర్: మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ధర్మారం, టీకనపల్లి గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతంలో పులి సంచారం కలకలం రేపింది. మంగళవారం బుగ్గగట్టు ప్రాంతంలో గొర్రెల మందపై దాడి చేసి మూడు గొర్రెలను హతమార్చింది. గమనించిన స్థానికులు వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు పాదముద్రల ఆధారంగా పెద్దపులిగా గుర్తించారు. అప్రమత్తంగా ఉండాలని సమీప గ్రామాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీచేశారు.

# విద్యుత్ భారం పడకుండా కాపాడారు

మొదటిపేజీ తరువాయి

విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి ఈఆర్సీ తిరస్కరించినందుకు రాష్ట్రవ్యాప్తంగా సంబురాలు జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ.18500 కోట్ల భారం పడకుండా ఆపినందుకు విజయ సూచికగా ఈ సంబురాలు నిర్వహించాలని కోరారు. రాష్ట్రంలోని జిల్లా కేంద్రాలు, నియోజకవర్గాల్లో సంబరాలు జరపాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పది నెలల కాలంలోనే 18500 కోట్ల విద్యుత్ ఛార్జీల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసిందని కేటీఆర్ అన్నారు. ప్రజలపై విద్యుత్ భారం మోపడాన్ని ప్రధాన ప్రతిపక్షంగా వ్యతిరేకించామని తెలిపారు. పబ్లిక్ హియరింగ్‌లో పాల్గొని దీనిపై ఈఆర్సీపి ఒప్పించలిగామని చెప్పారు. ప్రధాన ప్రతిపక్షంగా తమ వాదనలోని సహేతుకత, న్యాయాన్నిను ఈఆర్సీ గుర్తించి విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను తిరస్కరించిందని అన్నారు. విద్యుత్ పెంపు ప్రతిపాదనలను తిరస్కరించి నందుకు ఈఆర్సీ చైర్మన్ శ్రీ రంగారావు, సభ్యులు మనోహర్ రాజు, కృష్ణయ్యకు తెలంగాణ ప్రజల తరపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు కేటీఆర్ ట్వీట్ చేశారు. విద్యుత్ చార్జీల పేరిట రూ. 18,500 కోట్ల అదనపు భారం ప్రజలపై మోపడాన్ని హైదరాబాద్, నిజామాబాద్, సిరిసిల్లలో నిర్వహించిన మూడు బహిరంగ విచారణలలో తాము తీవ్రంగా వ్యతిరేకించామని కేటీఆర్ తెలిపారు. ఇది తెలంగాణ ప్రజల విజయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్ తీసుకుని వచ్చిన మార్పు ఇదే

మొదటిపేజీ తరువాయి

ఈ తగ్గుదల రాష్ట్ర మూలధన పెట్టుబడులపై ప్రభావం చూపిస్తూ, ఉద్యోగ అవకాశాలు తగ్గడం, తద్వారా ప్రత్యక్ష, పరోక్ష పన్నుల వసూళ్లు క్షీణించిందని తెలిపిందన్నారు. ఇది తెలంగాణ ఆర్థిక అభివృద్ధికి గొడ్డలి పెట్టు అంటూ ఆయన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం స్టార్టప్ తెలంగాణ వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నట్టు చెప్పు కుంటుందని... కానీ వాస్తవాలకు భిన్నంగా పరిస్థితులు ఉన్నాయన్నారు. కొత్త కంపెనీల సంఖ్య పడిపోవడం, లక్ష్యాన్ని చేరుకోకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్ల తెలంగాణలో ఉద్యోగ ఉపాధి అవకాశాలను కోల్పోవడమే కాక ఆర్థిక అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందని చెప్పుకొచ్చారు. ఇదీ... తెలంగాణలో కాంగ్రెస్ తెచ్చిన అసలైన మార్పు అంటూ హరీష్ రావు పోస్టు చేశారు.

## తిహాడ్ జైల్ వార్డెన్ కనుసన్నల్లో మాదక ద్రవ్యాల తయారీ ఫ్యాక్టరీ

నిషేధిత మాదక ద్రవ్యం



మెథాంపెటమైన్(మెథ్) తయారీ ల్యాబ్‌ను దిల్లీ ఎన్‌సీఆర్ పరిధిలో ఎన్‌సీబీ అధికారులు గుర్తించారు. దీని నిర్వహణ వెనుక ఏకంగా తిహాడ్ జైలు వార్డెన్ హస్తం కూడా ఉందని తెలుసుకొని నిర్ఘాంతపోయారు. అక్టోబర్ 25వ తేదీన గ్రేటర్ నోయిడా పరిధిలో ఎన్‌సీబీ దాడులు నిర్వహించింది. ఒక ఇంట్లో నిర్వహిస్తున్న మెథ్ ల్యాబ్‌ను గుర్తించింది. దీనిని తిహాడ్ జైలు వార్డెన్, దిల్లీకి చెందిన ఓ వ్యాపారవేత్త, ముంబయికి చెందిన కెమిస్ట్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ దేశీయ వినియోగానికి, అంతర్జాతీయ ఎగుమతుల కోసం సింథటిక్ డ్రగ్స్‌ను తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘన, ద్రవ రూపాల్లో ఉన్న దాదాపు 95 కిలోల మెథ్‌ను వారు స్వాధీనం చేసుకొన్నారు.ఈ ఫ్యాక్టరీ ఆవరణలో ఎసిటోన్, సోడియం హైడ్రాక్సైడ్, మిథాలిన్ క్లోరైడ్, ప్రీమియం గ్రేడ్ ఎథనాల్, రెడ్ పాస్ఫరస్, ఈథైల్ ఎసిటేట్ వంటివి లభించాయి. తయారీ కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకొన్న పరికరాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఇక్కడ పట్టుబడిన వ్యాపారవేత్తను గతంలో కూడా ఒక ఎన్డీపీఎస్ కేసులో డిపార్ట్‌మెంట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అరెస్టు చేసింది. ఆ సమయంలో అతడిని తిహాడ్ జైల్లో ఉంచగా.. అక్కడ వార్డెన్‌తో పరిచయం పెంచుకొని అతడిని కూడా ఈ మత్తు వ్యాపారంలోకి దించాడు.వీరి ఫ్యాక్టరీలో ముంబయికి చెందిన కెమిస్ట్ మాదక ద్రవ్యాలను తయారు చేయగా.. వాటి నాణ్యతను దిల్లీలో ఉండే మెక్సికన్ ముఠా సభ్యుడు పరీక్షించేవాడని ఎన్‌సీబీ ఓ ప్రకటనలో తెలిపింది. గతంలో ఎన్‌సీబీ గుజరాత్‌లోని గాంధీ నగర్, అమ్రేలి, రాజస్థాన్‌లోని జోధ్‌పుర్, సిరోహి, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ డ్రగ్ ల్యాబ్‌లను కనుగొన్నారు.

## రుణమాఫీపై ప్రతిపక్షాలవి కారుకూతలు:

మొదటిపేజీ తరువాయి

తొమ్మిది సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇది రైతు పక్షపాత ప్రభుత్వం. వారికి ఎక్కడా ఇబ్బంది కలగకూడదని విప్లవాత్మక మార్పులు చేశాం. ఇప్పటికే రూ.18వేల కోట్ల రుణమాఫీ చేశాం. రుణమాఫీపై ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. అర్హులైన రైతులందరికీ తల తాకట్టు పెట్టయినా రుణమాఫీ చేస్తాం. డిసెంబర్‌లోపే రూ.13 వేల కోట్ల రుణమాఫీ అమలు చేస్తాం.అర్హత ఉన్న పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను దీపావళి కానుకగా ఇవ్వబోతున్నాం. నాడు రాజశేఖర్ రెడ్డి ఉన్నప్పుడు ఎలా ఇళ్లు కట్టించారో ఇప్పుడూ అలాగే ఇస్తాం. సన్నరకం వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పాం.. ఇవ్వబోతున్నాం. ధాన్యంలో తేమ శాతం కోసం ఎండబెట్టుకుని తీసుకెళ్లాలి. సీసీఐ నిబంధనల ప్రకారం రైతులు పత్తిని తీసుకురావాలి. కొనుగోలు కేంద్రాల వద్ద సమస్యలను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకురావాలి. రైతులు ఫిర్యాదు చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటాం. అన్నదాతలకు ఎక్కడా నష్టం కలగకుండా చూడాలి. వారి అవసరాలు, కష్టాలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని పొంగులేటి అన్నారు.

## రేవంత్ ప్రభుత్వంతో అప్రమత్తంగా ఉండాలి

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,అక్టోబర్29(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తిగా విఫలమయ్యారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తమ వైఫల్యాలను, అవినీతిని ఎండగడుతున్నందుకు బీఆర్ఎస్ పార్టీ మీద వాళ్లు అసహనంతో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపడంలో మద్దతు పలికిన బీఆర్ఎస్ నాయకులు, సోషల్‌మీడియా వారియర్స్‌కు ఈ సందర్భంగా కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. గత రెండు రోజులుగా మనం చూసింది సుదీర్ఘమైన రాజకీయ కక్ష సాధింపుల ప్రహసనంలో తొలి అంకం మాత్రమే అని కేటీఆర్ అన్నారు. రానున్న రోజుల్లో అనేక విధాలుగా బురదజల్లేందుకు ప్రయత్నిస్తారని చెప్పారు. అందుకే ఈ కుట్రలు, వ్యక్తిగత దాడులు, అబద్ధపు ప్రచారాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అక్రమ కేసులు పెడతారని.. డీప్‌ఫేక్ టెక్నాలజీతో వీడియోలు వదులుతారని.. పెయిడ్ ఆర్టిస్టులతో నాటకాలు వేస్తారని కేటీఆర్ అన్నారు. బీజేపీ, కాంగ్రెస్, టీడీపీలు తమ పెయిడ్ సోషల్‌మీడియా ట్రోల్స్ అందరూ మనపై దాడికి ఏకమవుతారని పేర్కొన్నారు. ఈ దాడులను చూసి ఆగం కావద్దని.. ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటంలో ఏ మాత్రం పక్కకు జరగవద్దని సూచించారు. తెలంగాణ ప్రజల బాగు కోసం మనం చేస్తున్న పోరాటాన్ని కొనసాగిద్దామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ అవినీతి, అసమర్థత, ద్వంద్వ నీతిని ఎప్పటికప్పుడు బయటపెడదామని సూచించారు. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాల అమలులో రేవంత్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజల ముందు పెట్టి ప్రజాక్షేత్రంలో శిక్షిద్దామని పిలుపునిచ్చారు.

## అయోధ్య వానర సేనకు.. అక్షయ్ కుమార్ దీపావళి కానుక..!

బాలీవుడ్ ప్రముఖ నటుడు అక్షయ్ కుమార్ మంచి మనసు చాటుకున్నారు. దీపావళి సందర్భంగా అయోధ్య రామమందిరం చుట్టూ ఉండే కోతులకు ఆహారం అందించారు. మందిరానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా.. మూగ జీవాలకు దీపావళి కానుకగా తన వంతు కృషి చేశారు.బాలరాముడి మందిరం చుట్టూ ఆకలితో ఉన్న వానర సేన కోసం ఫీడింగ్ వ్యాన్‌ను పంపించారు. ఆయన అక్కడున్న కోతులకు ఆహారం ఏర్పాటు చేయడం ఇది తొలిసారి కాదు. అయోధ్య మందిరం ప్రారంభం అయినప్పటి నుంచి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. లక్షలాది మంది భక్తులు స్వామి దర్శనానికి వస్తుంటారు. అలాంటి సమయంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా.. మూగ జీవాల రక్షణ కోసం మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పట్టణ శివార్లలోని సురక్షిత



ప్రాంతంలో సుమారు 1200 కోతులకు నిత్యం పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు.

అందుకే ఈ కార్యక్రమం..

"పవిత్ర అయోధ్యలో ఆహారం కోసం కోతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలిసినప్పుడు బాధగా అనిపించింది. వాటి కోసం నా వంతు కృషి చేయాలనుకున్నా. అందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించా. దీపావళి సందర్భంగా నా తల్లిదండ్రులకు నివాళులర్పిస్తూ.. వారి పేరిట కోతులకు ఆహారం అందించే ఏర్పాటు చేశాను. దీన్ని చూసి ఎక్కడున్నా వారు సంతోషిస్తారని ఆశిస్తున్నా" అని అక్షయ్ కుమార్ ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంపై అయోధ్య పీఠాధిపతి స్వామి రాఘవాచార్య స్పందిస్తూ.. అక్షయ్‌పై ప్రశంసలు కురిపించారు."అయోధ్యలో ఉన్న వానర సేనకు ఆహారం అందించడం నిజంగా గొప్ప విషయం. భక్తులు, మూగ జీవాలకు ఆయన చేస్తున్న సేవ స్ఫూర్తిదాయకం. ఆయనపై ఎప్పుడూ రాముడి ఆశీస్సులు ఉండాలని ఆశిస్తున్నా" అంటూ అతడికి ధన్యవాదాలు తెలిపారు. కాగా.. అక్షయ్ గతంలో ముంబయిలోని హాజీ అలీ దర్గా పునరుద్ధరణ కోసం రూ. 1.21 కోట్లు విరాళంగా ఇచ్చారు. కోవిడ్ సమయంలో పీఎం నిధికి రూ. 25 కోట్లు అందించారు.

## భారాస ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్టులు చేయించాలి: కాంగ్రెస్ ఎంపీ అనిల్ యాదవ్

హైదరాబాద్: రాజ్యసభ సభ్యుడు, కాంగ్రెస్ నేత అనిల్ యాదవ్ సంచలన



వ్యాఖ్యలు చేశారు. భారాస ఎమ్మెల్యేందరికీ డ్రగ్స్ టెస్టులు చేయాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "డ్రగ్స్ బయట పడిన ప్రతిసారి వాళ్లు బయటకు వచ్చి మాట్లాడుతున్నారు. భారాస ఎమ్మెల్యేలు డ్రగ్స్ టెస్టులు చేయించుకోవాలి. రాజ్ పాకాల, విజయ్ మద్దూరిని వెనుకేసుకరావడానికి కేటీఆర్‌కు సిగ్గు ఉండాలి. గత ప్రభుత్వం డ్రగ్స్ కేసుని ఏ విధంగా దారి మళ్లించిందో ప్రజలకు తెలుసు. జన్వాడ పామ్ హౌస్ అంటేనే వివాదాలకు కేంద్రం. ఒకసారి దీపావళి ఫెస్టివల్, ఇంకోసారి గృహ ప్రవేశం అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేస్తుంటే.. వాళ్లు డ్రగ్స్‌ను ప్రేరేపించాలని చూస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు.

## సజ్జలను నిలదీసిన వైకాపా కార్యకర్తలు



పామర్రు: కష్ట కాలంలో అండగా ఉండాల్సిన నాయకులే పట్టించుకోకపోతే ఎలా అని వైకాపా కార్యకర్తలు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని నిలదీశారు. కృష్ణా జిల్లా పామర్రులో మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటికి సజ్జల వచ్చారు. ఈ విషయం తెలుసుకుని పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. నేతలతో మాట్లాడి ఆయన వెళ్లిపోతుండగా.. కార్యకర్తలు అడ్డుకుని నిలదీశారు. ఇంతమంది కార్యకర్తలు వస్తే కనీసం పలకరించకుండా వెళ్లిపోవడమేంటని ప్రశ్నించారు. ధైర్యంగా ఉండి పార్టీ కోసం పోరాడాలనే భరోసా ఇవ్వకుండా అలా ఎలా వెళ్లిపోతారని నిలదీశారు. దీంతో చేసేదేమీ లేక సజ్జలతో పాటు అక్కడి నేతలు వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.



# రాజ్ పాకాలతో రసమయికి లింకులు

# డ్రగ్స్ వాడకంపై అనుమానాలు

## కొత్త జయపాల్ రెడ్డితో మైత్రీ వెనుక మతలబేమిటి?

**కరీంనగర్ అక్టోబర్ 29 కరపత్రం**
జన్వాడ ఫాంపౌజ్ లో జరిగిన దివాళీ దావత్ లో డ్రగ్స్ వాడినట్టుగా నమోదైన కేసులో పరారీలో ఉన్న ఆ ఫాంహౌజ్ యజమానికి రాజ్ పాకాలతో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ పార్టీ దళిత నాయకులు ఆరోపించారు. డీసీసీ కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఎస్సీ సెల్ తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు రెడ్డిగాని రాజు మంగళవారం ఎల్.ఎం.డీ కాలనీలో సంయుక్తంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్ పాకాలతో రసమయి బాలకిషన్ కు బలమైన సంబంధాలు న్నాయని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రాజ్ పాకాల ఇంట్లో రసమయి ఫొటోలు ఉండటం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యవహారంలో రసమయి పాత్ర తేలాల్సి ఉందన్నారు. పార్టీలో కొకైన్ మద్దూరి విజయ్ కొకైన్ వాడినట్టుగా పరీక్షల్లో తేలడమే కాకుండా స్వయంగా ఆయనే పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నందున జన్వాడ ఫాంహౌజ్ లో జరిగింది మందు పార్టీ కాదని, డ్రగ్ పార్టీ అని వారు పేర్కొన్నారు. గులాబీ నేతలు డ్రగ్ పార్టీని మందు పార్టీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. ఇంట్లో జరిగే విందయితే క్యాసినోలో వాడే కాయిన్లతో పనేమిటని వారు ప్రశ్నిస్తూనే ఇది తెలంగాణ సంస్కృతి కాదని పేర్కొన్నారు.

### కొత్త జయపాల్ రెడ్డితో మైత్రీ వెనుక మతలబేమిటి?

మైత్రి ఛానెల్ యజమాని కొత్త జయపాల్ రెడ్డి మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణతో గల రాజకీయ విబేధాలను దృష్టిలో పెట్టుకొని ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనాలు ప్రసారం చేస్తూ ఎమ్మెల్యే ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. ఛానెల్ ను అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే పై సాగిస్తున్న తప్పుడు ప్రచారాలపై కొత్త జయపాల్ రెడ్డిను కాంగ్రెస్ పార్టీ నాయకులు విమర్శలు చేస్తే రసమయికి కలిగిన నొప్పేంటని వారు ప్రశ్నించారు. జయపాల్ రెడ్డితో బాలకిషన్ కు గల మైత్రీబంధం తేలాలన్నారు. జయపాల్ రెడ్డితో కలిసి రసమయిలు జరిపిన అమెరికా, దుబాయ్, మస్కట్ దేశాల పర్యనలపై కూడా అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు.

### అనుచిత వ్యాఖ్యలు మానకుంటే నాలుక చీరుస్తాం

మానకొండూర్ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఇక సహించబోమని సముద్రాల లక్ష్మణ్, అలువాల కోటి, పసుల వెంకటి, రెడ్డిగాని రాజు స్పష్టం చేశారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఉన్నప్పుడే మా తడాఖా చూపించాం. అప్పుడు పిడికెడు మంది ఉన్నప్పుడే భయపడేదు. ఇప్పుడు అధికారంలో ఉన్నాం. గుప్పెడు మంది ఉన్నారు. చీల్చి చెండాడుతామని వారు రసమయిని హెచ్చరించారు. దళితులను కుక్కలతో పోల్చుతూ రసమయి మాట్లాడటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి దళిత జాతిలో చీడపురుగు లాంటోడివని, ఎయిడ్స్ సోకిన గజ్జి కుక్కవని బాలకిషన్ ను విమర్శించారు. కేసీఆర్ గేట్ వద్ద కట్టిపడేయబడ్డ కుక్కవంటూ వారు నిందించారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తిమ్మాపూర్ లో అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పడం చేతగాని రసమయి ఇప్పుడు విగ్రహం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని వారు విమర్శించారు. విగ్రహాన్ని త్వరలో నెలకొల్పేందుకు రాష్ట్ర బీసీ సంక్షేమం,రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హామీ ఇచ్చారని చెప్పారు. దళితులను రసమయి ఏనాడూ పట్టించుకోలేదని, తన స్వార్థ ప్రయోజనాల కోసం దళితులపై దాడులకు తెగబడటమే కాకుండా అక్రమంగా కేసులు నమోదు చేయించారని, ఇతర సామాజికవర్గానికి చెందిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించేవారని వారు ఆరోపించారు. సొంత పార్టీ వారిని బలితీసుకోవడానికి వెనుకాడని నైజం అతనిదని వారు పేర్కొన్నారు. మహంకాళి శ్రీనివాస్ అనే దళితుడి మృతికి కారణం మీరు కాదా అని రసమయిని సూటిగా ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏ మాత్రం పట్టించుకోని రసమయి అధికారం లేనప్పుడు తన అవసరాల కోసం దళిత సంఘాలను వాడుకుంటున్నారని వారు ఘాటుగా విమర్శించారు.

### అక్రమాస్తుల చిట్టా విప్పుతాం

గోసి, గొంగడి, గజ్జెలేసుకొని వచ్చి ఎమ్మెల్యే గా రెండు పర్యాయాలు ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటి వరకు రసమయి బాలకిషన్ అక్రమంగా సంపాదించిన ఆస్తుల చిట్టా విప్పుతామని వారు స్పష్టం చేశారు. సాధారణ వ్యక్తి వందల కోట్ల ఎలా ఎదిగారో ప్రజలకు వివరించాలని వారు డిమాండ్ చెప్పారు. నియోజకవర్గంలోనే కాకుండా హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఆస్తుల ఎలా కూడబెట్టాడో వివరాలు తమవద్ద ఉన్నాయని, ఎమ్మెల్యేగా హోదాను అడ్డుపెట్టుకొని పెద్ద ఎత్తున అవినీతి,అక్రమాలకు పాల్పడ్డారని వారు ఆరోపించారు. ప్రభుత్వ భూముల కబ్జాలకు పాల్పడ్డారని, విల్లాలు, ఫాంహౌస్ లు, కోళ్ల ఫారాలు ఎలా వచ్చాయో గుట్టు విప్పుతామన్నారు.

ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కనుకం అశోక్, మచ్చ రాజేశం, కొంకటి రాములు, నాయకులు చలిగంటి సంపత్, జీడీ శ్యామ్, కోంద్ర సురేష్, అలువాల కుమార్, శంకర్, మాతంగి సంతీష్, ఎస్.అనిల్, మానాల రవి ఎస్.శ్రీనివాస్, జే.మధు.శ్రీనివాస్, ఎల్.శ్రీనివాస్,కె.రాములు,ఎం ప్రభాకర్,రాసూరి మల్లికార్జున్, సిరిసిల్ల రాజు, యు.నరేష్. హాసన్, ఎల్ మల్లయ్య టి.జంపన్న జి.రాజమల్లు, జి.చిట్టిబాబు,కనకం కుమార్,ఎస్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పట్టబద్రుల ఓటర్ నమోదు కోసం ప్రత్యేక సెల్ ప్రారంభం

**– బరిలో ఎవరు నిలిచినా కాంగ్రెస్ మద్దతుదారునికే ఓటు వేయాలని కోరిన కాంగ్రెస్ నేతలు**




**కరీంనగర్ అక్టోబర్ 29 కరపత్రం**
మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు త్వరలో జరుగన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటర్ నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ అయినందున, జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా పట్టభద్రుల ఓటు నమోదు చేపట్టాలనే ఉద్దేశంతో పిసిసి, డిసిసి ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, విభాగాల అధ్యక్షులతో కలిసి డిసిసి కార్యాలయంలో పట్టబద్రుల ఓటర్ నమోదు కోసం ప్రత్యేక సెల్ ప్రారంభించడం జరిగింది
ఈ సందర్భంగా డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పురుమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పర్యవేక్షణ కమిటీ సభ్యులు మడుపు మోహన్ లకు పలువురు పట్టబద్రులు ఫామ్ 18 ఓటరు నమోదు దరఖాస్తు ఫారంలను అందజేయడం జరిగింది.
అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి నేతలు మాట్లాడుతూ 2021 నవంబర్ 1వ తేదీకి (3 సంవత్సరాలు) ముందు డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు 2024 నవంబర్ 6 తేదీ లోపు తమ ఓటు నమోదు చేసుకోవాలని, గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన పట్టభద్రుల సైతం తిరిగి కొత్తగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సి ఉంటుంది అని, ఇందుకోసం కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయడం జరిగిందని ఈ విభాగం ద్వారా పట్టభద్రులకు ఎలాంటి సందేహాలు ఇబ్బందులు ఉన్న పరిష్కరించటానికి కృషి చేయడం జరుగుతుందని, ఆన్లైన్ మరియు ఆఫ్ లైన్ రెండు పద్ధతుల ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని ఇందుకోసం ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డ్, డిగ్రీ మెమో, పాస్పోర్ట్ సైజ్ ఫోటో తో పాటు ఫామ్ 18 లో పూర్తి వివరాలను పొందుపరిచి కార్యాలయంలో అందజేయవచ్చునని, కాంగ్రెస్ పార్టీకి చెందిన సంబంధిత బాధ్యులు ఆ ఆ ఓటర్ నమోదు ఫారాలను జిల్లా ఎన్నికల విభాగానికి అందజేసి ఓటు నమోదు చేయించడం జరుగుతుందని, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ సూచనతో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలు, పట్టణాలు డివిజన్ స్థాయిలో నేరుగా పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా బరిలో ఎవరు నిలిచినా, కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపిన ఎమ్మెల్సీ అభ్యర్థికే పట్టభద్రులు తమ ఓటు వేసి గెలిపించాలని కాంగ్రెస్ నేతలు పట్టభద్రులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాలు, విభాగాల అధ్యక్షులు శ్రీమతి కర్ర సత్య ప్రసన్నారెడ్డి, పడాల రాహుల్, ఎండి తాజుద్దీన్, పులి ఆంజనేయులు గౌడ్, పురం రాజేశం, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్, నాయకులు రామిడి రాజిరెడ్డి, నిహాల్ అహ్మద్, వంగల విద్యాసాగర్, హైమద్ అలీ, సిరిపురం నాగప్రసాద్, బోనాల మురళీ మనోహర్, గడ్డం శ్రీరాములు, శ్రీమతి లావణ్య, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి పాదా పూజా

**కుకునూరుపల్లి అక్టోబర్ 29,కరపత్రం**



సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ఉమామహేశ్వర క్షేత్రంలో కుకునూరు పల్లి గ్రామ నివాసి గంగిశెట్టి పవన్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి పాదా పూజా కార్యక్రమం మంగళవారం అంగరంగ నిర్వహించడం ఇట్టి కార్యక్రమంలో స్వామి వారి శిష్య బృందము భక్తులు బంధుమిత్రులు అధికలో సంఖ్యలో విచ్చేసి ఇట్టి సేవా కార్యక్రమంలో పూజా కార్యక్రమం పాల్గొని స్వామి వారి దర్శించి తీర్థప్రద స్వీకరించి అన్న ప్రసాద సేవ కార్యక్రమం పాల్గొని ధన్యులైనారు హాలో ఇట్టి పాదపూజ కార్యక్రమం విచ్చేసిన మాధవానంద సరస్వతి స్వామి వాక్యానములు మనము ప్రతిరోజు దేవాలయాలు దర్శిస్తూ మన దైవ కార్యక్రమాలు నిమగ్నమై ఉంటే మనవి లోక సంరక్షణ దేవతలు ఎల్లవేళలా కాపాడుతూ ఉంటారని ప్రతి స్త్రీలో దైవ స్వరూపిణిగా అమ్మవారిని దర్శించాలి గోవులో సర్వ దేవతలను దర్శించాలి లోక సేవలో పాల్గొనుకుంటూ లోక సంరక్షణ కొరకు దైవ సేవలో పాల్గొనాలి ఇలా మన పిల్లలకు కూడా ప్రతిరోజు దేవాలయాలను సందర్శించే విధంగా అలవాటు చేయాలి ప్రతిరోజు దేవాలయాలు లో జరిగే సేవా కార్యక్రమంలో పాల్గొనే విధంగా పిల్లల్ని ప్రోత్సహిస్తూ ఉండాలని తెలిపారు

# కాంగ్రెస్ పేరుకే ప్రజపాలనా చేసేది చేతగాని పాలన



**సిరిసిల్ల అక్టోబరు 29 కరపత్రం**
**రైతుల గోసను పట్టించుకొని పాలకులు**
ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభం చేయ్యలి అని డిమాండ్ చేస్తున్న బిఆర్ ఎస్ సినియర్ నాయకులు పొచవేని ఎల్లయ్య యాదవ్ ఒకటో వార్డు రగుడులో వరి ధాన్యం కోసి 70 శాతం పూర్తయింది కానీ ఇప్పటికి కూడా సకాలంలో తూకం వేయడం లేదు.రైతులు ఇబ్బంది పడుతున్నారు ఈ తూకం వేయకపోవడం వలన రైతులు ప్రైవేట్ గా దళారులకు , రైస్ మిల్లుల ల్లో క్వింటాల్కు 1800 రూపాయల చొప్పున అమ్ముకొని రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారు.కావున అధికారులు వెంటనే స్పందించి వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం చేయాలని డిమాండ్ చేస్తున్న పొచవేని ఎల్లయ్య యాదవ్ గత ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల బాదలు తెలిసిన నాయకుడు కాబట్టి రైతుల కోసం రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, ఉచిత కరెంటు, ఇలాంటి ఎన్నో పథకాలు పెట్టి రైతులను ఆదుకున్న ఘనత కేసిఆర్ గారికి దక్కుతుంది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు రుణమాఫీ లేదు, రైతుబంధు లేదు, రైతు బీమా లేదు సాగునూరు లేదు రైతులకు ఇచ్చిన మాట ఏదీ నెరవేర్చని ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎప్పుడు ఎండగడుతునే ఉంటాం.తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు గత పది సంవత్సరాల్లో దీపావళికి ముందే వడ్ల కొనుగొలు కేంద్రం ప్రతి గ్రామంలో ప్రారంభించినాడు. రైస్ మిల్ అలాట్మెంట్ చేయడం జరిగింది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల బాధ పట్టించుకోవడం లేదు ఇప్పటి వరకు తూకాలకు పంపించడం లేదు రైస్ మిల్లలకు అలామ్మేంట్ ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులంటే ఇంత చులకన ఎద్దు ఏడ్చిన ఎవుసం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడ్డట్టు ఈ చరిత్రలో ఎప్పుడు లేదు రేవంత్ రెడ్డికి రైతులు రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్తారు వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారభం చేసేదాకా రైతుల పక్షాన నిలబడి రైతులకు అండగా ఉంటాం ఇట్టి కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు బూర తిరుపతి బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు బూర కమలాకర్, మాస అనిల్, మాసరాములు,స్వామి,మదు,సిరిసిల్ల లింగం,ఏశ నాగరాజు రైతులు తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల్లో పడకేసిన ప్రత్యేక అధికారుల పాలన

- »గ్రామ పంచాయతీ లను పట్టించు కొని ప్రత్యేక అధికారులు.
- »వారానికోసారి కూడా గ్రామాలకు రానీ పరిస్థితి.
- »గ్రామాల్లో పేరుక పోతున్న అనేక సమస్యలు.
- »క్షీణిస్తున్న పారిశుద్ధ్య లోపం.
- »రోగాల బారిన పడుతున్న ప్రజలు
- »మమ్మల్ని పట్టించించుకోండి అంటున్న మండల లోని గ్రామాల ప్రజలు.




**కరపత్రం బెజ్జంకి:అక్టోబరు 29**
గ్రామాల్లో సర్పంచ్ ల గడువు ముగియడంతో, గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది. ఓవైపు గ్రామాల్లో ఎక్కడికక్కడే సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ప్రత్యేక అధికారులు మాత్రం పల్లెలకు చుట్టపు చూపుగానే వస్తున్నారు. పారిశు ద్ధ్యంపై పర్యవేక్షణ లేకపోవటం తో అనేక సమస్యలతో పంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి.
సమస్యల తో గ్రామాల్లో పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది అని చెప్పు కోవచ్చు పాలకవర్గాల గడువు ముగియడంతో, ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు , ప్రత్యేక అధికారుల పాలనతో కొంత ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామాల్లో ఒక్కో అధికారికి మూడు నాలుగు పంచాయతీల నిర్వహణ బాధ్యతలు అప్పగించడం, వారు చుట్టపు చూపుగానే గ్రామాల్లో పర్యటనలు చేస్తుండటంతో, సమస్యలు విపరీతంగా పేరుకుపోతున్నాయి. ప్రధానంగా తాగునీటి సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు, పాడైన చేతిపంపులు నెలల తరబడి మరమ్మతులు చేయకపోవడం, పారిశుద్ధ్యంపై పర్యవేక్షణ కొరవడటం వంటి సమస్యలతో పంచాయతీలు విలవిల్లాడుతున్నాయి. బెజ్జంకి మండలం లోని 23 గ్రామ పంచయతీల్లో ప్రత్యేక అధికారాల పాలన కొనసాగుతోంది. 23 గ్రామ లతో పాటు నూతంగా ఒక గ్రామ పంచాయతీ వచ్చినది. ఈ ఏడాది మొదట్లోనే గ్రామాల్లో పాలకవర్గాల గడువు ముగియడంతో, ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన చేపట్టింది. పెద్ద పంచాయతీలకు మండల అధికారులు, చిన్న పంచాయతీలకు ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందిని ప్రత్యేక అధికారులుగా నియమించి పాలన సాగిస్తున్నారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ సమస్యలు పేరుకుపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గ్రామాల్లో బోర్లు పాడైపోయాయి. వాటిని బాగు చేయించే వారే లేకుండా పోయారు. మిషన్ భగీరథ పైపుల లీకేజీ లతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుంది. బెజ్జంకి మండల కేంద్రంలో నీ డబుల్ బేడ్ రూమ్ కాలనీ లో ప్రజలు నీటి సమస్య ఎదుర్కొంటున్నారు. పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మురుగు కాల్వల శుభ్రత వారానికోసారి కూడా సాధ్యం కాకపోవడం వల్ల, పారిశుద్ధ్యం పడకేసింది. డ్రైనేజీ లతో సాయంత్రం పూట అధిక దోమలతో చిన్నపిల్లలు కు విష జ్వరాలు వస్తున్నాయని. సర్పంచ్ లు ఉన్న సమయంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచులు చూసునుకునే వారు. మురికి కాలువలో పడవేసిన ప్రజా ధనం మండల కేంద్రము లోని మురికి కాలువ గత అధికారి గ్రామ అధికారి రెండు సార్లు నిర్మించారు కానీ ఇప్పటికీ అది అస్తవేస్తంగానే నిర్మించారు అని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మురికి కాలువ నిర్మించినప్పటికి మురికి నీరు రోడ్ల మీద ఏరులై పారుతోంది. ప్రభుత్వ ప్రజా ధనం మురికి కాలువలో పడవేశారాని కమిషన్ల కోసం పనిచేశారని ప్రజలు బాహాటంగా నే అంటున్నారు.

# 20 ఏళ్ల తర్వాత రోలెక్స్ కోసం..

## ఆసక్తికర విషయాన్ని పంచుకున్న సూర్య




వైవిధ్యమైన కథలు, పాత్రలను ఎంచుకుని అటు తమిళ, ఇటు తెలుగు ప్రేక్షకులను అలరించే కథానాయకుడు సూర్య . లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'విక్రమ్' . 2022లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. సినిమా మొత్తం ఒకెత్తయితే, ఇందులో చివరి 20 నిమిషాలు మరొకెత్తు. డ్రగ్స్ మాఫియాను శాసించే రోలెక్స్ పాత్రలో సూర్య కనిపించింది కొద్దిసేపే అయినా, థియేటర్ మొత్తం దద్దరిల్లిపోయింది. ప్రేక్షకుడు ఓ సరికొత్త అనుభూతితో బయటకు వచ్చాడు. తాజాగా సూర్య నటించిన 'కంగువా' ప్రమోషన్స్‌లో భాగంగా రోలెక్స్ పాత్ర గురించి ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ధూమపానానికి 20ఏళ్లుగా దూరంగా ఉన్న సూర్య కేవలం రోలెక్స్ పాత్ర కోసం మళ్లీ సిగరెట్ కాల్చడం మొదలు పెట్టారు. 'తొలుత సిగరెట్ లేకుండా సన్నివేశాన్ని చేద్దామన్న ఆలోచన వచ్చింది. ప్రతినాయక ఛాయలున్న పాత్ర కావడంతో మరింత ఇంటెన్స్ కోసం సిగరెట్ కాల్చక తప్పలేదు. దర్శకుడు లోకేష్ కేవలం రోలెక్స్ పాత్ర గురించి ఓ ఐడియా చెప్పారంతే. ఆ సీన్ ఏంటి?పాత్ర ఎలా ఉంటుంది? అని వివరించారు. షూటింగ్ వెళ్లే ముందు నేను కనీసం రిహార్సల్స్ కూడా చేయలేదు. పైగా షూటింగ్ రోజు ఉదయం నేను చెప్పాల్సిన డైలాగ్స్‌ను పంపారు. అవి చదువుకుని సెట్‌కు వెళ్లిపోయాను. అప్పటికే సిద్ధంగా ఉన్న స్కెచెస్ ఆధారంగా మేకప్ ఆర్టిస్ట్ నన్ను రెడీ చేశారు. మధ్యాహ్నానికి నాకు సంబంధించిన షూట్ పూర్తయింది" అని చెప్పుకొచ్చారు.కమల్‌హాసన్‌కు అభిమాని అయిన సూర్య ఆయన ఎదుట నటించాలంటే కాస్త భయపడినట్లు చెప్పారు. తనకు సంబంధించిన సన్నివేశాలు తీసే సమయంలో కమల్‌హాసన్ సెట్‌కు వస్తారని చిత్ర బృందం చెప్పిందట. దీంతో దర్శకుడు లోకేష్‌ను పిలిచి 'ఆయన వచ్చేలోపు నా సన్నివేశాలను పూర్తి చేసేయ్' అని కోరినట్లు సూర్య చెప్పుకొచ్చారు. లోకేష్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'రోలెక్స్' పేరుతో ప్రత్యేకంగా ఒక మూవీ రానుంది. గతంలో సూర్య నటించిన మరో చిత్రంతో దానికి కనెక్షన్ ఉన్నట్లు ఇటీవల ప్రకటించారు. ప్రస్తుతం సూర్య నటించిన 'కంగువా'కు శివ దర్శకుడు. నవంబరు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.

# వేటకు సిద్ధమైన డైరెక్టర్ రాజమౌళి..

## ఆసక్తికరమైన ఫొటో షేర్ చేస్తూ మహేష్ మూవీ అప్డేట్!





ప్రస్తుతం ఇండియా నుండి వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ అండ్ హైపుడ్ మూవీ ఏదైనా ఉందంటే అది మహేష , రాజమౌళి కాంబోలో వస్తున్న మూవీ అని చెప్పాలి. మూవీ ప్రకటన తప్ప ఇప్పటివరకు ఒక్క అప్డేట్ కూడా రాకపోయినా..ఇండియన్ సినీ ఫ్యాన్స్ వేరే లెవెల్?లో ఎక్స్పెక్టేషన్స్ పెట్టుకున్నారు. ఎంతలా అంటే.. ప్రతిదీ తెలుసుకునేంతలా.. సినిమా కోసం రాజమౌళి వ్యూహాలు తెలిస్తే హ్యాపీగా ఫీల్ అయ్యేంతలా! లేటెస్ట్ విషయానికి వస్తే.. ప్రస్తుతం డైరెక్టర్ రాజమౌళి, మహేష్ సినిమా కోసం తన టీమ్?తో కలిసి సౌతాఫ్రికా వెళ్లినట్లు తెలుస్తోంది. ఎస్ఎస్ఎంబీ 29 ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ అడ్వెంచర్ యాక్షన్ మూవీ కావడంతో, ఎక్కువ భాగం అడవుల్లోనే షూటింగ్ ప్లాన్ చేసేలా పక్క ప్రణాళికతో రెడీ అయ్యారు. ఎస్ఎస్ఎంబీ 29 టీమ్ అంతా ప్రీ ప్రొడక్షన్ పనులపైనే ఉంది. ఈ నేపథ్యంలో రాజమౌళి దక్షిణాఫ్రికాలో కొన్ని దట్టమైన అడవుల్లో తన బృందంతో కలిసి రెక్కీ నిర్వహిస్తున్నారు. మొన్నటికీ మొన్న తనయుడు ఎస్ ఎస్ కార్తికేయ పోస్ట్ చేసిన ఫొటోలో రాజమౌళి జీపులో పయనిస్తూ అడవిని గమనించడం చూశాం.ఇక తాజాగా డైరెక్టర్ రాజమౌళి స్వయంగా ఓ ఫోటోని పోస్టు చేస్తూ ఇంట్రెస్టింగ్ క్యాప్షన్ ఇచ్చారు. 'కనుగొనడం కోసం తిరుగుతున్నా' అని ఫోటోకి క్యాప్షన్ పెట్టడంతో మహేష్ ఫ్యాన్స్ లో అంచనాలు పెరిగిపోయాయి. దాంతో త్వరలోనే అప్‌డేట్ షేర్ చేయాలని మహేష్ ఫ్యాన్స్ మాత్రమే కాకుండా వరల్డ్ సినీ ఫ్యాన్స్ కోరుతున్నారు. కాగా మునుపెన్నడు చూడని విధంగా ఇండియన్ స్క్రీన్ పై అదిరిపోయే లొకేషన్స్ లో రాజమౌళి ఈ సినిమాని షూట్ చేయబోతున్నట్లు తెలుస్తోంది.ఇకపోతే హై-వోల్టేజ్ యాక్షన్ అండ్ అడ్వెంచరస్ ఎంటర్టైనర్ గా రానున్న ఈ సినిమాలో మహేష్ బాబుకు జోడీగా ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ నటించనుందని తెలుస్తోంది. రాజమౌళి తండ్రి విజయేంద్రప్రసాద్ కథ అందిస్తుండగా..కీరవాణి మ్యూజిక్ సమకూరుస్తున్నారు. రూ.1000 కోట్ల భారీ బడ్జెట్ తో దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## 'తండేల్' అప్‌డేట్ ఇచ్చిన దర్శకుడు..

### జనవరికి సిద్ధమే.. కానీ!



నాగచైతన్య ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'తండేల్' . చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో సాయిపల్లవి కథానాయిక. సరికొత్త కథాంశంతో రూపొందుతోన్న ఈ చిత్రం కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్‌పై దర్శకుడు అప్‌డేట్ ఇచ్చారు. 'షూటింగ్ దాదాపు పూర్తయింది. జనవరికి సిద్ధంగా ఉన్నాం. ఇంకా 10 రోజుల చిత్రీకరణ మాత్రమే ఉంది. సంక్రాంతికి రామ్‌చరణ్, వెంకటేశ్ సినిమాలు వస్తే.. ఈ సినిమా కొంచెం వాయిదా పడుతుంది. జనవరి 26న విడుదల చేద్దామంటే అది ఆదివారం కాబట్టి చేయలేకపోతున్నాం. సంక్రాంతి కంటే ముందు విడుదల చేయాలంటే సినిమా కంప్లీట్ కాదు. ఇక ఈ సినిమాలో ఎన్నో భావోద్వేగాలు ఉన్నాయి. కచ్చితంగా అందరూ ఈ చిత్రాన్ని ఎంజాయ్ చేస్తారు' అని చెప్పారు. దీంతో వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమా విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.అల్లు అరవింద్ సమర్పిస్తున్న 'తండేల్' దేశభక్తి అంశాలతో నిండిన రా రస్టిక్ ప్రేమకథతో తెరకెక్కుతోంది. నాగ చైతన్య ఇందులో రాజు అనే మత్స్యకారుడిగా కనిపించనున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఓటీటీ డీల్ పూర్తయింది. చైతూ కెరీర్‌లోనే అత్యధికంగా రూ.40 కోట్లకు ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ మూవీ రైట్స్‌ను దక్కించుకుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇంతకుముందెప్పుడూ చేయని సరికొత్త పాత్రలో చైతూ.. సాయిపల్లవి డీగ్లామర్ లుక్స్‌లో కనిపించనుండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి. కొన్ని రోజుల కిందట హైదరాబాద్‌లో జరిగిన షెడ్యూల్‌లో నాగచైతన్యపై ఓ భారీ పోరాట ఘట్టాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ స్వరాలు అందిస్తున్న సంగతి తెలిసిందే.

# చాలా విషయాల్లో నేనే ఫస్ట్



ఒక నటిగా నేనేం చేయగలననేది 'లక్కీ భాస్కర్' సినిమాతో ఈ ప్రపంచానికి తెలుస్తుందని... ప్రతి ఒక్కరూ తమని తాము చూసుకునే చిత్రమిదని చెప్పుకొచ్చింది మీనాక్షి చౌదరి. దక్షిణాది భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ కెరీర్‌ని పరుగులు పెట్టిస్తున్న కథానాయిక ఈమె. దుల్కర్ సల్మాన్‌కి జోడీగా 'లక్కీ భాస్కర్'లో నటించింది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం దీపావళి సందర్భంగా ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా మీనాక్షి సోమవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించింది."నన్ను నేను సవాల్ చేసుకుంటూ... విభిన్నమైన పాత్రల్ని భుజానికెత్తుకుంటూ... నటిగా మరింత ఎదిగే అవకాశం నాకు లభిస్తోంది. చిన్న వయసులోనే ఇంత వైవిధ్యమైన ప్రయాణం సాగిస్తుండడం ఎంతో తృప్తినిస్తోంది. దర్శకుడు వెంకీ అట్లూరి ఈ కథ చెప్పగానే ఇందులోని భావోద్వేగాలు నా మనసుని హత్తుకున్నాయి. బ్యాంకింగ్ రంగం నేపథ్యంలో కొన్ని సిరీస్‌లు వచ్చాయి. కానీ ఆ నేపథ్యాన్ని కుటుంబ భావోద్వేగాలతో ముడిపెడుతూ వెంకీ ఈ కథని మలిచిన విధానం నాకు చాలా నచ్చింది. నేను పోషించిన సుమతి పాత్ర కూడా అదే స్థాయిలో ఆకట్టుకుంది. 'గుంటూరు కారం' తర్వాత సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కుటుంబంలో నేనొక భాగమైపోయా. ఆ సంస్థ నుంచి ఇలాంటి మరో అవకాశం రావడం ఎంతో తృప్తినిచ్చింది".

### అందుకే డబ్బున్నా.. మార్పేమీ ఉండదు

"మధ్య తరగతి కుటుంబంలో పుట్టి పెరిగాను. మా నాన్న ఆర్మీ ఉద్యోగి. అమ్మ పదో తరగతి చదివిన ఓ గృహిణి. పంజాబ్‌లోని ఓ చిన్న గ్రామం మాది. మా ఊర్లో డాక్టర్ అయిన మొదటి అమ్మాయిని నేనే. నటిని అయిన అమ్మాయినీ నేనే. అలా చాలా విషయాల్లో నేనే ఫస్ట్. మా ఇంట్లో తొలి ప్రాధాన్యం చదువుకే. అలాంటి ఊరు, నేపథ్యం నుంచి వచ్చినదాన్ని కాబట్టి, డబ్బున్నా ఇప్పటికీ నా జీవితంలో పెద్ద మార్పేమీ ఉండదు. చాలా భారతీయ కుటుంబాలు ఇలాగే ఉంటాయి. ఆ నేపథ్యంలో సాగే ఈ కథ అలా అందరికీ కనెక్ట్ అవుతుంది. 'గుంటూరు కారం' సినిమాలో నా పాత్ర చాలా మందిని నిరాశపరిచింది. ఈ సినిమాతో వాళ్లందరినీ సంతృప్తి పరిచేలా ఉంటుంది నా పాత్ర".

### తల్లిగా నటించడమే సవాల్..

"తన కుటుంబమే ప్రపంచంగా భావించే ఓ మధ్య తరగతి యువతి సుమతి. భాస్కర్‌తో కలిసి జీవించడమే తన ప్రాధాన్యం. అవసరానికి సరిపడా డబ్బుంటే చాలనుకునే యువతి. సంతోషంగా సాగిపోతున్న తన జీవితంపై డబ్బు ఎలాంటి ప్రభావం చూపించిందన్నది ఇందులో కీలకం. నేను తల్లి పాత్రలో నటించింది ఇందులోనే. అది నాకు సవాల్‌గానే అనిపించింది. ఆ భావోద్వేగాల్ని సరిగ్గా అర్థం చేసుకోవడం కోసం నా చిన్నప్పుడు మా అమ్మ ఎలా ఉండేవారో, ఆమెతో నేనెలా ఉండేదాన్నో ఊహించుకుంటూ పాత్రలో ఒదిగిపోయే ప్రయత్నం చేశా. యువ బృందం కలిసి చేసిన చిత్రమిది. నాకూ, దుల్కర్‌కీ తెలుగు మాతృభాష కాదు. అందుకే మేం ముందుగా ఈ కథని బాగా అర్థం చేసుకుని నటించడం కోసం ప్రత్యేకంగా సన్నద్ధమయ్యాం. అందుకు తగిన సమయం కూడా మాకు దొరికింది".

### అలాంటి అవకాశాలే వస్తున్నాయి

"మంచి కథల్లోనూ, పాత్రల్లోనూ నటించడమే నా లక్ష్యం. నేనిలాంటి పాత్రల్లోనే కనిపిస్తాననే పరిమితులేమీ లేవు. అయినా ఒకే తరహా పాత్రల్లో కనిపిస్తే ప్రేక్షకులకూ నచ్చదు. అందుకే వైవిధ్యం ప్రదర్శిస్తున్నా. అలాంటి అవకాశాలూ నా తలుపు తడుతున్నాయి. రానున్న నెల రోజుల్లో నా సినిమాలు మూడు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. ప్రతి సినిమా ఓ కొత్త రకమైన నటిని, ఓ కొత్త పాత్రని ఆవిష్కరిస్తుంది. మూడేళ్లుగా సాగుతున్న నా కెరీర్‌లో పది సినిమాలు చేశా. నటి కావడమన్నదే ఎంతో మంది కల. అలాంటిది ఏ నేపథ్యం లేకుండా వచ్చి మూడు భాషల్లోనూ అగ్ర కథానాయకులు మహేశ్‌బాబు, విజయ్, దుల్కర్ సల్మాన్‌లతో కలిసి నటించడం గర్వంగా ఉంది".